# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 27 ఫిబ్రవరి 2023


## భక్తులతో కిక్కిరిసిన గంగమ్మ జాతర

**లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**



మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ జాతర ఆదివారం భక్తులతో కిక్కిరి సింది. ప్రతి ఏటా జాతర ముగిసిన మొదటి ఆదివారం భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఈ ఆదివారం దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించారు. ఆలయ అర్చకులు ఆదిమూలం వంశీయులు రెడ్డిశేఖర్ అమ్మవారిని ప్రత్యేకంగా పూలు అలంకరించి వచ్చిన భక్తులకు దర్శనాన్ని కల్పించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ సామాల నరసింహారెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలవ పందిళ్లు తాగునీరు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వరప్రసాద్ ఎస్సై వినోద్, పోలీసులను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వరకు జాతర భక్తులతో కిటకిటలాడింది.

## ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థి మృతి

**ఖాజీపేట ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**



బద్వేల్‌లోని గౌరీశంకర్ నగర్‌కు చెందిన కార్తీక్ ఆదివారం ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కార్తీక్ ఖాజీపేటలోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. మరో నెలరోజుల్లో పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంది. హాస్టల్‌లో ముగ్గురు వార్డెన్లు ఉన్నప్పటికీ విద్యార్థులపై సరైన పర్యవేక్షణ లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ కుమారుడు పబ్లిక్‌పరీక్షలు రాసి ఇంటికి వస్తాడని ఆశించిన బాలుని తల్లిదండ్రులు కుమారుని మరణవార్త విని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమ కుమారుని మృతికి కారణమైన వార్డన్‌ను విధుల నుంచి తొలగించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# మొదటి రోజు ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతం

**కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**




ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఇంటర్ సైన్స్ విద్యార్థులకు సంబంధించి ప్రాక్టికల్స్ పబ్లిక్ పరీక్షల్లో మొదటి స్పెల్లో భాగంగా 64 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 6181 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 205 మంది విద్యార్థులు గైర్హాజరవడంతో 5976 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆర్ఐవో రమణరాజు పర్యవేక్షణలో ప్రాక్టికల్స్ పరీక్షలు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రా లలో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ నిర్వహించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల సదుపాయాలను అందుబాటులో ఉంచారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి పరిశీలకుడిగా రమణ పరీక్ష కేంద్రాలను పరిశీలించి, పరీక్షలు సజావుగా జరిగేందుకు తగిన సూచనలు చేసి, జిల్లా అధికారులను పరీక్షల ఏర్పాట్లు గురించి అభినందించారు. ఈ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షణకు ఏడుగురు స్క్వాడ్ బృందాలను ఏర్పాట్లు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి.

# ఏళ్లుగా ఏజి గార్డెన్ నీటి సమస్య

**నాయకులకు పట్టని ఇందిరమ్మ కాలనీ ....కాలనీల్లో మౌళిక వసతులు కరువు**





**రాయచోటి.ఫిబ్రవరి26 ప్రభాతవార్త**

రాయచోటి పట్టణం మదనపల్లి రోడ్డులో పురపాలక సంఘానికి కూతవేటు దూరంలోని ఏజి గార్డెన్ కాలనీ ఇందిరమ్మ కాలనీ సమస్యలు పట్ల అధికార పార్టీ నాయకులు సంబందిత అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. 2008-2010 మధ్య సుమారు 1000 కుటుంబాలకు ఇళ్ల పట్టాలిచ్చి గృహాలు మంజూరు చేయడం జరిగింది. వాటిలో సుమారు 200 మంది పేదలు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లను నిర్మించుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. ఏజి గార్డెన్‌లో దాదాపు 1000 మందికి ఇంటి పట్టాలివ్వడం జరిగింది. అయితే ఈ పట్టాలు తీసుకున్న అనేక మంది ఇల్లు నిర్మించుకోలేదు. ఇటీవల రాయచోటి జిల్లా కేంద్రం కావడం దాంతో పట్టాలు తీసుకున్న అనేక మంది ఇల్లు నిర్మించుకోలేదు. ఇక్కడ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఏజి గార్డెన్ ప్రజలు అనేక సార్లు అధికారులను అధికార పార్టీ రాజకీయ నాయకులు చుట్టు తిరిగిన ఫలితం శూన్యమని అక్కడ ప్రజలు ఆరోపించారు. ప్రస్తుతానికి వారానికి రెండు సార్లు నీటి ట్యాంకర్లు ద్వారా నీరు డ్రమ్ములకు నింపుతున్నారు. ఈ నీటి ట్యాంకర్లు రాకపోతే ప్రజలుకు ఎలాంటి వసతి కాలనీ లో లేదు. అలాగే కాలనీలో రోడ్లు డ్రైనేజి కరెంటు సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తాగు నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో అల్లాడిపోతున్నారు.

**ప్రతి ఇంటి ముందు నీటి డ్రమ్ములు:**

ఏజి గార్డెన్ కాలనీలో ఏ ఇంటి ముందు చూసినా నీటిని నింపుకునేందుకు పెద్ద నీటి డ్రమ్ములు దర్శనం ఇస్తున్నాయి. ఒకటి రెండు ఇళ్లకు కలిపి ఓ డ్రమ్ముకు లేదా రెండు డ్రమ్ములకు నీళ్ల నింపి ట్యాంకర్ యజమానులు వెళ్తున్నారు. ఆ సమయంలో ఇంటి యజమానులు లేకపోతే రెండు మూడు రోజులు నీటి కోసం ఆగాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో దాహం తీర్చుకోవడానికి చిన్న పెద్ద కలిసి బిందెలతో ఇందిరమ్మ కాలనీ వరకు వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడ చేతి పంపు బోర్లు కూడా వేయకపోవడంతో అన్ని అవసరాలకు ట్యాంకర్ నీటిని వాడుకోవాల్సి వస్తుంది. ఇందిరమ్మ కాలనీలో 570 గృహాలు 2006- 2007 సంవత్సరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేయడం జరిగింది. ఈ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అన్ని గృహాలకు కలిపి ఒకే బోరు ఉండటంతో ఆ బోరు ద్వారా అన్ని గృహాలకు నీరు అందడం లేదు. ముఖ్యంగా ఇందిరమ్మ కాలనీ గుట్టలో నిర్మించడం కిందివైపు ఇళ్లకు మాత్రమే నీరు అందుతోంది. అప్పట్లో వెయ్యి లీటర్ ట్యాంక్‌లు నిర్మించి నీటిని నింపేవారు. ట్యాంక్‌లు కాలక్రమేణా పగిలిపోవడం వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడం ప్రస్తుతం బోరు మోటర్ నుంచి డైరెక్ట్‌గా గృహాలకు పంపిస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న గృహాలకు మాత్రమే నీరు అందుతోంది. మిట్ట ప్రాంతంలో ఉన్న ఇళ్లకు నీరు అందడం లేదు. ఈ విషయమై కాలనీవాసులు అనేకమార్లు జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

**పరిధిమాది కాదు .... ఒకరిపై ఒకరు నెపం :**

రాయచోటి పురపాలక అధికారులు ఇందిరమ్మ కాలనీ తమ పరిధి కాదంటున్నారు. పంచాయతీ అధికారులదీ అదే మాట చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎంపిడివో కార్యాలయంకు వెళ్లి తాగునీరు అందిచాలని కోరితే కాలనీ పురపాలక పరిధిలోకి వస్తుందని తప్పుకుంటున్నారు. వెలిగల్లు తాగునీటి పైపులైన్ రాయుడు కాలనీలో ఉన్నాయి. అక్కడ నుంచి ఏజి గార్డెన్‌కు చాలా దగ్గరగా ఉంది. అక్కడ నుంచి పైపులైన్ ఎక్స్‌టెన్షన్ చేసి సరఫరా అందిస్తే ఇందిరమ్మ కాలనీ ఏజి గార్డెన్ కాలనీల తాగు నీటి సమస్య పరిష్కరించాలని అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.

ఏజి గార్డెన్ పంచాయతీ పరిధిలో ఉంది మా పరిధిలోకి రాదు. ఇప్పటికే సమస్యను స్థానికులు కలెక్టర్ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. ట్యాంకర్ ఏర్పాటు చేయమని చెప్పడంతో టాంకర్‌తో నీటి సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమీషనర్ ఆర్.రాంబాబు తెలిపారు. పైప్‌లైన్‌లు ఇచ్చే అవకాశం లేదు. శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**పాములతో భయపడుతున్న ప్రజలు:**

ఇందిరమ్మ కాలనీ ఏజి గార్డెన్ కాలనీలు గుట్టల మధ్య ఇల్లు నిర్మించుకోవడం ఈ ఇళ్లకు సక్రమమైన రహదారులు వేయకపోవడం దట్టమైన కంప చెట్లు గుట్టలు రాళ్లు అధికంగా ఉన్నాయి. ఇందులో అధికంగా పాములు సంచరిస్తున్నాయని రాత్రులు మరీ భయంకరంగా రకరకాల విష సర్పాలు తిరుగుతుండటంతో ఇక్కడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. నాయకులు ఎన్నికల సమయంలో సమస్యలు పరిష్కరిస్తాం అని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని తరువాత తమను పట్టించుకోవడం లేదని ఈ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుని ఇందిరమ్మ కాలనీ, ఏజి గార్డెన్ సమస్యలను సత్వరం పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# చెయ్యేరు రక్షణగోడల నిర్మాణమెప్పుడో?

- 7 కిలోమీటర్ల దూరం కొట్టుకుపోయిన జగతికట్టలు
- పులపత్తూరు, మందపల్లెకు మాత్రం ఫ్లడ్‌బ్యాంకుల ఏర్పాటుకు ప్రతి పాదనలు
- 7 నెలలు కావస్తున్నా ఈ ప్రతిపాదనలకు దిక్కులేదు!!



**వరద భీభత్సం జరిగి మృత్యుఘోష మారుమ్రోగి 14 నెలలు కావస్తోంది. జలరాకాసి చెయ్యేరు పరివాహక గ్రామాలపై పడి 41 మందిని బలిగొంది. ఏరు, ఊరు ఒక్కటైంది. 48 గంటల పాటు వేలాది మంది నరకయాతన అనుభవించారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. వరద బాధిత గ్రామాలను ఆదుకొంటామన్నారు. గ్రామాలను వరద ముంచెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ గుప్పించారు. అయినా అతీగతి లేదు. జలవనరులశాఖ అధికారులు దయతలచి 7 నెలల క్రితం 2 గ్రామాల పరిధిలో ఫ్లడ్‌బ్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. వాటికి దిక్కులేదు.**

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

2021 నవంబరు 19న అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్‌డ్యామ్ కొట్టుకుపోయి చెయ్యేరుకు వరద పోటెత్తి నది పరివాహక గ్రామాలపై పడి దారుణం జరిగిన విషయం తెలిసిందే. వరద ముంచెత్తిన చెయ్యేరునది పరివాహక గ్రామాల ప్రజలు నేటికి కోలుకోలేదు. వరద గాయాలు మానలేదు. ప్రభుత్వం ఆదుకొంటుందన్న ఆశ చావడం లేదు. అధికారులు ప్రభుత్వానికి పంపుతున్న ప్రతిపాదనలకు స్పందన లేదు. సాక్షాత్తు సిఎంకే రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు నదిపరీవాహక గ్రామాల్లోకి వరదనీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ఇచ్చిన వినతులు ఏమయ్యాయో తెలియదు. వరదనీటి ఉధృతికి సుమారు 7 కిలోమీటర్ల పొడవైన చెయ్యేరు జగతికట్టలు నామరూపాలు లేకుండా పోయాయి. ఫలితంగా గ్రామాలకు గ్రామాలే సర్వనాశనం అయ్యాయి. వందలాది ఎకరాల భూములు జగతి కట్టలు కొట్టుకుపోయి ఇసుక మేటలు పాలయ్యాయి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదు అంటే నామరూపాలు లేకుండా పోయిన జగతి కట్టలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. పులపత్తూరు, మందపల్లె, పాపరాజుపల్లె, శేషమాంబపురం, ఎగువపేట, గుండ్లూరు, రాచపల్లె, తొగురుపేట, పాటూరు, ఎంజిపురం, హేమాద్రివారిపల్లె గ్రామాల పరిధిలో జగతికట్టలు ధ్వంసమయ్యాయి. అయితే పులపత్తూరు, మందపల్లె గ్రామాల ప్రజలు స్థానిక నేతలు ఒత్తిడితో జల వనరుల శాఖ అధికారులు స్పందించి తాత్కాలికంగా నివేదికలు సిద్ధం చేశారు. పులపత్తూరు వద్ద 7.62 కోట్లతోను, మందపల్లె వద్ద 4 కోట్లతోను ఫ్లడ్‌బ్యాంకులు ఏర్పాటుకు అంచనాలు రూపొందించారు. నీటిపారుదలశాఖ ఎస్ఇ కె.శ్రీనివాసులు గత యేడాది జులై 7న లెటర్ నంబరు ఎస్ఇ/ఐసి/కెడిపి/టిఎస్/ ఎం.ఈటిఎస్/215 సిఇను పంపారు. ఇప్పటికి ఈ ప్రతిపాదనలకు స్పందన లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేయడంలేదు. ఈనెల 24న అన్నమయ్య ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో చెయ్యేరు నదిపరివాహక గ్రామాలకు ఫ్లడ్‌బ్యాంకులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని నది పరీవాహక గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ప్రజల ప్రాణాలను బలిగొన్న తర్వాత కూడా పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఏ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ప్రశ్నించారు. అసలే డ్యామ్ లేదని, మరలా వరద పోటెత్తితే తమ గ్రామాల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. జగన్ సర్కార్ ఇకనైనా స్పందిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.





# సుద్ద లారీలతో రైతులు సతమతం

- దుమ్ము కాలుష్యంతో పాడైపోతున్న పండ్ల తోటలు
- లబోదిబోమంటున్న జీవీ పురం రైతన్నలు

**ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**





ప్రకృతి వైపరీత్యాలు ఆపైన తెగుళ్లతో పండ్ల తోటల రైతులు సతమతమవుతుంటే మరో పక్క జీవీ దళిత రైతులకు దుమ్ము కాలుష్యంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. జీవీపురం దళిత రైతులక దాదాపు వందల ఎకరాలు ప్రభుత్వ భూమి అర్హులైన రైతులకు పట్టాలు ఇవ్వడంతో వారు అప్పులు చేసి ఎన్నో తిప్పలు పంటలు సాగు చేసుకొని చేతికందే పంటలను మార్కెట్‌కు తరలించలేక మరో పక్క వర్షాకాలంలో రోడ్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అదే తరుణంలో వేసవి కాలంలో సుద్ద లారీల రాకపోకలతో దుమ్ముకాలుష్యం అధికమై ఆ దుమ్ము పండ్ల తోటలపై పేరుకు పోగా పండ్ల తోటలు పాడై పోతున్నాయని దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా లారీలతో సుద్ద రవాణా చేసే సమయంలో రోడ్డుపై ప్రజలు ప్రయాణించాలంటే నరకయాతన అనుభవించక తప్పదని పలువురు ఆరోపిస్తున్నారు. అదే విధంగా భారీ ఎత్తున లారీలు వెళ్లే సమయంలో దుమ్ము, దూళి ఆకాశాన్నంటేలా రోడ్లపై ప్రయాణించే వారి జాడే తెలియకుండా దుమ్ముకాలుష్యం పేరుకుపోవడంతో నరకం చూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. జీవీ పురం దళిత గ్రామాల ఫారెస్టు పరిధిలో కాంట్రాక్టుల నిర్వాకంతో ప్రభుత్వం నుంచి సుద్ద క్వారీలను లీజుకు తీసుకొని లైసెన్సులు పొంది ఆ రోడ్డుపై తారు రోడ్డు నిర్మించలేకపోవడంతో లారీలు రాకపోకల వల్ల అటు గ్రామస్థులు, పంటల పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికాక తప్పడం లేదు. కోట్లాది రూపాయలు లాభాలు పొందుతున్న సుద్ద కాంట్రాక్టర్లు ప్రభుత్వం నుంచి తారురోడ్డు మంజూరు చేయించి రైతులకు సౌకర్యంగా దుమ్ము కాలుష్యం లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారి లావాదేవీల కోసం మా పంట పొలాలకు వెళ్లే రోడ్లపై వాహనాలు భారీ సంఖ్యలో 30 టన్నులు సుద్దను క్వారీ నుంచి తరలించడంతో రోడ్లు మరమ్మతులు చేయకుండా దుమ్ము దూళితో రోడ్లు కప్పబడడం వల్ల తద్వారా పంటలపై గాలి ద్వారా దుమ్ము పేరుకుపోయి చేతికి అందాల్సిన పండ్ల తోటలు పాడైపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత సుద్ద వ్యాపారులు, కాంట్రాక్టర్లు చొరవ చూపి సుద్ద క్వారీల వరకు తారు రోడ్డు వేయించాలని రైతులు కోరుతున్నారు.

# నాడు - నేడు పనులకు నిధులు కొరత

- ప్రచారం ఎక్కువ - నిధులు తక్కువ
- అరకొర పనులతో నిలబడిపోయిన పాఠశాలల నిర్మాణాలు
- పనులు పూర్తయ్యే అవకాశం ఉందో లేదో..



**నందలూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి నాడు నేడు కార్యక్రమం నిధుల కొరతతో అరకొర పనులతో నిలబడిపోవడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు ఎక్కువ నిధులు జారీ చేయడంలో విఫలమైందని విమర్శిస్తున్నారు. జిల్లా స్థాయిలో నాలుగు నేడు పనులు ప్రారంభించి నేటికి 6 నెలలు గడిచిన నేపథ్యంలో పనులు సగం కూడా పూర్తికాకపోవడం చూస్తుంటే దేనికి నిదర్శమని ప్రజలు అంటున్నారు. నందలూరు మండలంలో నాడు నేడు కింద 19 పాఠశాలల్లో ఎంపికైన నేపథ్యంలో వాటిలో ఇప్పటివరకు సగం కూడా పనులు జరగలేదని స్థానికులు అంటున్నారు. ప్రచారానికి చేసిన ఖర్చులో సగం ఈ పాఠశాలల్లో నాడు నేడు పనులకు కేటాయించి ఉంటే ఎప్పుడో పూర్తయి ఉంటాయని అంటున్నారు. మోడల్ స్కూల్‌గా తయారు చేయాలని చేపట్టిన ఈ కార్యక్రమం అధోగతిపాలవ్వడం చాలా అదృష్టకరం ఇప్పటికీ కొన్ని స్కూళ్లల్లో పనులు చేసినవారికి కూడా కూలీలు చెల్లించలేని స్థితిలో ఉన్నారంటే ఈ పథకం ఎంత నిర్వీర్యం అయిపోయిందో అర్థమవుతుంది. పథకాలు ప్రవేశపెట్టడం వరకు బాగుంది వాటి అమలులో ఎన్నో లోపాలు కనపడుతున్నాయి. నాడు నేడు కింద విడుదలైనటువంటి మొదటి విడత గ్రాంట్‌లో పాఠశాల్లోని టాయిలెట్ల మరమ్మతులకు ఉపయోగించాలని సూచనలు ఉన్నప్పటికీ అమలు చేయడంలో ప్రాధాన్యత లేకపోవడం దురదష్టకరం. ఇప్పటికీ చాలా ప్రభుత్వ పాఠశాలల్లో బాత్‌రూంలు లేక స్కూల్ పిల్లలు ఆరుబయటనే మూత్ర, మల విసర్జన చేస్తున్నారు. స్కూల్‌కమిటి ఛైర్మన్, ప్రధానోపాధ్యాయుల వారికి నచ్చిన పనులు చేసుకోవడం తర్వాత ప్రాధాన్యత బాత్‌రూంలకు ఇవ్వడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదు. దీనిపై మండల బాధ్య విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా ఏ పాఠశాలలోనైనా 40 శాతం నిధులు బాత్‌రూంలో కేటాయించేందుకు, మిగిలిన మొత్తం పాఠశాల యొక్క కరెంటు, రంగులు, బెంచీలు వంటి వాటికి ఉపయోగించే విధంగా మాకు లెటర్లు వచ్చాయని వీటిపై మేము పరిశీలిస్తున్నామని సంబంధించిన పాఠశాలలకు వెళ్లి అక్కడ మంజూరైన నిధులను ఇంజనీరును అడిగి ఎంతవరకు ఖర్చు పెట్టారు వివరణ తీసుకుంటామని అన్నారు. ప్రస్తుతానికి మొదటి విడతగా విడుదలైన నిధులు ఏ మేరకు ఖర్చు పెట్టారు పూర్తి వివరాలు మీకు తెలియజేస్తామని అన్నారు. ఇంకా నిధులు రావాల్సి ఉందని విడుదలైన నిధులలో చాలావరకు స్కూల్లో వంద శాతం ఖర్చు పెట్టారని ఈదరపల్లె స్కూల్లో 55 శాతం మాత్రమే నిధులు ఖర్చు అయ్యాయని వాటిపై మేము దృష్టి పెట్టి స్కూల్లో అభివద్ధికి మా వంతు సహాయ సహకారాలు సంబంధించిన పాఠశాలలకు అందజేస్తామని ఆయన అన్నారు.

# నాటు తుపాకి స్వాధీనం

## వ్యక్తి అరెస్టు - కేసు నమోదు

**చిట్వేలి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

చిట్వేలి మండల పరిధిలోని చిన్నరాచపల్లె గ్రామంలో కడప జిల్లా ఎస్‌పి, రాజంపేట ఎస్‌పిడిఒ ఆదేశాల మేరకు చిన్నరాచపల్లెలో శనివారం సాయంత్రం నాటు తుపాకిని స్వాధీనం చేసుకొని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు రైల్వేకోడూరు సిఐ విశ్వనాథ్‌రెడ్డి ఆదివారం పాత్రికేయులకు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ముందుగా అందిన సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడిచేసి ఏదోటి వెంకటసుబ్బయ్య(74)ను అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి సింగిల్ బారెల్ నాటు తుపాకిని స్వాధీనం చేసుకున్నామని సిఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ ఆయుదాలు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమన్నారు. అక్రమ ఆయుదాలు కలిగి ఉన్నవారు స్వచ్ఛందంగా పోలీసులకు స్వాధీనం చేయాలని సిఐ విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. లేనిపక్షంలో అట్టివారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ దాడిలో రైల్వేకోడూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, చిట్వేలి హేడ్‌కానిస్టేబుల్ కాటమయ్య, కానిస్టేబుళ్లు రెడ్డయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. చిట్వేలి స్టేషన్‌లో కేసు నమోదు చేసి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.




**అలరించిన నవదుర్గాల సందర్శనం** IIలో

**రైతులను మోసం చేసిన ప్రభుత్వం** IIలో

## రైతులను మోసం చేసిన ప్రభుత్వం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



మండలంలోని ఎల్లటూరు గ్రామంలో ఆదివారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నర సింహారెడ్డి మాట్లాడుతూ వైకాపా ప్రభు త్వం వచ్చినప్పటికి రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా మోటార్లకు కరెంటు మీటర్లు బిగించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన వాపోయారు. పలువురు కుటుంబాల తెదేపాలో సభ్యత్వం పొందారని పార్టీలోకి ఆహ్వానించామన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపాకు గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, అంజలి, బాషా, నాగమల్లారెడ్డి, చెంద్రాయుడు, అన్నమయ్య, కిశోర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త



దమ్మనపల్లె గ్రామవాసి అయిన టిడిపి కార్యకర్త రోడ్డు ప్రమాదంలో దుర్మ రణం చెందిన విషయం తెలిసినదే. కావున అతను తెలుగుదేశం కార్యకర్త కాబట్టి తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అతనికి ఆర్థిక సాయం 25 వేల రూపా యలు టిడిపి నాయకులు అందజేశారు.

## టీచర్స్ కాలనీలో పార్కు ఏర్పాటు చేయాలని వినతి

పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త



స్థానిక పోరుమామిళ్లలోని ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డికి, రంగసముద్రం పంచాయతీ సర్పంచ్ చిత్తారవికి ఆఫీసు పోరు మామిళ్ల రంగసముద్రం పంచాయతీలోని టీచర్ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు, టీచర్ సొసైటీ సభ్యులు అందరూ కలిసి తమ కాలనీలో ఉన్నటువంటి పార్కుకు సంబం ధించిన స్థలాన్ని కబ్జా గురవుతోందని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గురువులకు దేవుల్లుగా బావించి దక్షిణగా ఇచ్చినటు వంటి రెవెన్యూ అధికారులు ఈ రోజు గురువుల ఆస్తిని వేరే విధానాలకు చేయడం దుర్మార్గం అని వారన్నారు ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు రాజకీయ నాయ కులు టీచర్ల పైన ప్రతి ఒక్కరూ కరుణించి న్యాయం చేయగలరని ఈ విషయం ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి ఆర్డీవో గారుకు, కలెక్టర్ దృష్టికీ తీసుకోని పోయి టీచర్ కాలనీలో పార్కును, దేవాలయం బడినీ, ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల మండలలోని రంగసముద్రం టీచర్ కాలనీ సొసైటీ టీచర్ సభ్యులు రామ్మోహన్ రామసుబ్బారావు, పి శ్రీరాములు, జయరామిరెడ్డి, సి బాలసుబ్బయ్య, ఎస్‌టి కే.రామ్మోన్, మధు, పోలయ్య, టీచర్లు పాల్గొన్నారు.

## సేవకు ప్రతి రూపం రోటరీ క్లబ్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



జమ్మలమడుగు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కుండా భాస్కర్ మరియు ప్రధాన కార్యదర్శి కాటం పార్థసారథి, ముద్దనూరు మండల వ్యవసాయాధికారి మరియు రోటరీ క్లబ్ మెంబర్ మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి రోటరీ క్లబ్ (ఆర్ఐడీ 3160) నెల్లూరు లోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 2 రోజుల పాటు జరిగిన 39వ జిల్లా కాన్ఫరెన్స్ సమావేశంలో జమ్మలమడుగు రోటరీ క్లబ్ 15 మంది సభ్యుల క్లబ్ బృందంతో పాల్గొన్నట్లు క్లబ్ మెంబర్ మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్థాయిలో రోటరీ క్లబ్ 3160 పరిధిలో సాధించిన విజయాలు, సమాజానికి చేసిన సేవలు గురించి చెప్పారు. కార్య క్రమం లో గవర్నర్ ఒమ్మిన సతీష్‌బాబు, సీబీఐ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై రోటరీ క్లబ్ ద్వారా సమాజానికి చేసిన సేవలు మరియు చేస్తున్న కార్యక్రమాల గురించి కొనియాడారు. ప్రముఖ గాయ కుడు గజల్ శ్రీనివాస్, సినీ హాస్యనటుడు అలీ, ముద్దనూరు మండల వ్యవ సాయాధికారి క్లబ్ మెంబర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సేవకు ప్రతి రూపమే రోటరీ క్లబ్ అని మానవతా సేవలకు నిలయం రోటరీ క్లబ్ అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సతీమణి చరణకుమారి, వ్యవసాయాధికారి పాల్గొన్నారు.

## లోకేష్ బాబు నిర్ణయం ఆనందదాయకం

రాయచోటి టౌన్.ఫిబ్రవరి26 ప్రభాతవార్త



ఆర్ఎంపి, పిఎంపిలపై టిడిపి జాతీ య ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ బాబు నిర్ణయం ఆనందదాయకమని అన్నమయ్య జిల్లా ఆర్ఎంపి యూనియన్ ప్రెసి డెంట్ కెవిఎస్ నాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారాలోకేష్‌బాబు ఆర్ఎంపి సమస్యలును తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే 429 జీవోను పునరుద్దరించి అందులో కొన్ని సవరణలు చేసి ఐఎంఏ వాళ్లకు ఆర్ఎంపిలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఆర్ఎంపి, పిఎంపిలకు ట్రైనింగ్ ఇస్తామని ట్రైనింగ్ పూర్తయిన వాళ్లకు సర్టిఫికేట్ లు ఇప్పిస్తామని చెప్పడం జరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొందరు ఆర్ఎంపిలు శిక్షణ అర్ధాంతరంగా ఆగిపోవడం జరిగిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. కార్య క్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మహాల్ రవీం ద్ర, జిల్లా ప్రధానకార్యదర్శి డివిఎస్ రాజు, జిల్లా ట్రెజరర్ దొరబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.వీర శంకర్, జాయింట్ సెక్రటరీ శ్రీదర్ రెడ్డి, ఆర్ఎంపి యూనియన్ ప్రెసిడెంట్ లక్ష్మీకర్‌నాయుడు పాల్గొన్నారు.

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దర్గాలో ప్రార్థనలు

### ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



నగరంలోని 32వ డివిజన్ ఎం.ఆర్. వీధి నందు వెలసిన హజరత్ నాదర్‌షా వలీ దర్గా ఉరుసు మహోత్స వంలో పాల్గొని పూల చాదర్ సమర్పించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుభాన్‌బాషా, చాంద్‌బాషా, యువ నాయకులు, ఉమైర్, కార్పొరే టర్లు జఫ్రుల్లా, షంషీర్, చాక్లెట్ గౌస్, మాస్టర్ అహ్మద్, దర్గా కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

## బకాయిల చెల్లింపుల్లో జాప్యమెందుకు?

### – ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఎటువంటి ఢోకా లేదని చెబుతున్న ప్రభుత్వం సంవ త్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి న జడ్పీ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, డీఏ బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం కడపలోని వీవీఆర్ ఎస్టీ యూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపా ధ్యాయులకు చెల్లించాల్సి న బకాయిలన్నీ త్వర గా చెల్లించి మాట నిలబెట్టు కోవాలని కోరారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్య దర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఓపీఎస్‌ను తప్ప ఎటువంటి ప్రత్యా మ్నాయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. 12వ పీఆర్సీ గడువు సమీ పిస్తు న్నందున పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాల్సి న అవసరం ఉందన్నారు. ఉద్యోగ, ఉపా ధ్యాయ సమస్యల పరిష్కారం చేయకుండా అదే మొండి వైఖరిని ప్రదర్శిస్తే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్య క్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, ఆర్థిక కార్యదర్శి మహబూబ్ బాషా, రాష్ట్ర నాయకులు సుబ్ర మణ్యంరాజు, బాలగంగిరెడ్డి, దాదాపీర్, ఇలియాస్ బాషా, ఆది నారాయణ రెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, బాలరాజు, ఏపీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాగ సుబ్బారెడ్డి, సురేష్‌బాబు, రమణయ్య, జయరామయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

## నేటి ముస్లిం సమాజానికి ఏమైంది?

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



ఒకప్పుడు ముస్లిం సమాజం అంటే అందరిలో గౌరవం ఉండేదని, ఐక్యతకు మారు పేరుగా ముస్లింలు ఉండేవారని ధర్మ పరిచయ కమిటటీ కన్వీనర్ సయ్యద్ మహ్మద్ అన్నారు. దైవభక్తి, సత్య వం తులు, సమృద్ధి కలిగి ఉంటూ దైవారాధ కులుగా, అల్లాహ్‌కు మాత్రమే భయ పడి జీవనం సాగించేవారు. ముస్లిం ఇతరులు ముస్లింల ఐక్యతను ఆదర్శంగా తీసుకొనే వారు. అటువంటి ముస్లింలు నేటి సమాజంలో తమ ఉనికిని కోల్పోయే స్థితికి చేరారని ఆవేదన వ్యక్తం చేశారు. దైవానికి దూరమై స్వార్థానికి ప్రాముఖ్యతనిచ్చి విలాసవంతానికి బానిసలై అసత్యా పారులై, దురలవాట్లకు లోనై మోసపరులుగా మారారు. రాజకీయాలపై ఆసక్తి పెంచుకొని తమలో తాము విబేధాలు సృష్టించుకొని ఇతరుల దృష్టిలో చులకన అవుతున్నారని బాధపడ్డారు. ముస్లింలు కొనసాగితే రానున్న కాలంలో చాలా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పుడైనా సరే స్వార్థాన్ని వీడి అల్లాహ్‌కు భయపడి ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించి దైవకారుణ్యాన్ని పొంది కోల్పో తున్న ఉనికితో పాటు ఐక్యతతో మెలగాలని పిలుపునిచ్చారు.

## అపోలో హాస్పిటల్‌లో అందుబాటులోకి రోబోటిక్

### – సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డా.మదన్‌మోహన్‌రెడ్డి

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:




మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలో విప్లవాత్మక మార్పులు చోటు చేసు కున్న ట్లు నెల్లూరు అపోలో హాస్పిటల్ ఆర్థో పెడిక్ సీనియర్ కన్సల్టెంట్, రోబోటిక్ రీ ప్లేస్‌మెంట్ సర్జన్ సీనియర్ డా.మదన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక మానస ఇన్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా నెల్లూరు లోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో రోబోటిక్ ద్వారా మోకాళ్ల మార్పిడి సర్జరీని నిర్వహిస్తున్నామన్నారు. ఈ చికిత్స మహానగరాలకు మాత్రమే లభించేదన్నారు. తాజాగా అత్యాధునిక టెక్నాలజీతో నిర్వహించే రోబోటిక్ సర్జరీ సౌకర్యం అందరికీ అందుబాటులో ఉందన్నారు. కంప్యూటర్ త్రీడీ నమూనాను రూపొందించుకొని సిటీస్కాన్ ఆధారంగా ఏ భాగంలో ఆపరేషన్ నిర్వహించాలో ఒక కచ్చితమైన వర్చువల్ ప్లానింగ్ ఏర్పాటు చేసు కొని రోబోటిక్ అసిస్టెంట్ టెక్నాలజీ ద్వారా ఈ సర్జరీని విజయవంతంగా నిర్వహి స్తారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ సదుపాయం కలదన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు కార్తీక్‌రెడ్డి, వివేకా నందరెడ్డి, శశిధర్‌రెడ్డి, పృథ్వీ, చెన్నై హెల్త్ కేర్ సర్వీసెస్ అపోలో హాస్పిటల్‌లో ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 3వ వార్డులో ఇదేం కర్మ మన రాష్ట్రషానికి

కమలాపురం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కమలా పురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నర సింహారెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డు లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం లో భాగంగా తెదేపా నాయకులు ఇంటింటికి వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కమలాపురం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అభిప్రాయాలు తెలుసుకొని పార్టీ ఇచ్చిన అభిప్రాయ సేకరణ పత్రం లో వివరాలు సేకరించి పార్టీ నిర్దేశించిన ఫోన్ నెంబర్ 9261292612కి మిస్డ్‌కాల్ ఇవ్వమని రాబోయే ఎన్నికల్లో తెదేపాకు ఓటు వేసి పుత్తా నరసింహారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు వాసు దేవరెడ్డి, ఖాదర్‌బాషా, అంకిరెడ్డి, రైతు నాయకులు ప్రభాకర్ రెడ్డి, దివాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, యువత నాయకులు ఎర్రబల్లి చిన్న సుబ్బారెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, నియో జకవర్గ కాపు నాయకులు దాది రామయ్య, చెన్నకృష్ణారెడ్డి, శంకర్ యాదవ్, ఐటీడీపీ నరసింహ పాల్గొన్నారు.

## ఆప్ సభ్యత్వ నమోదు

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



కడప అప్సరా సర్కిల్ నందు శనివారం కడప జిల్లాలో ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతం కోసం ఆ పార్టీ జిల్లా కన్వీనర్ సాజిద్ హుసేన్, జిల్లా కోఆర్డినేటర్ రహ్మ తుల్లా, కోకన్వీనర్ దాదాపీర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫైజ దస్తగిరి, సీని యర్ నాయకులు డా.బేరిలా శ్రీనివాసుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాజిద్ మాట్లాడుతూ మెరుగైన వైద్యం, విద్య, యువతకు ఉద్యోగాలు, తాగునీరు, అవినీతి లేని పాలన రాష్ట్రం లో కరువయ్యాయని అందుకే ఢిల్లీ ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నాయ కత్వంలో ఆమ్ ఆద్మీపార్టీ ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన ఉచిత వైద్య, విద్య, ఒరెండు వందల యూనిట్లు ఉచిత కరెంటు, యువతకు ఉద్యోగం, ఇంటింటికి ఉచితంగా తాగునీరు, అవినీతి రహిత ప్రభుత్వ సర్వీసులు, మహిళలకు ఉచిత బస్సు సర్వీసు, ప్రజా పాలన అందిస్తోందని అన్నారు. యువత సభ్యత్వ నమోదు చేయించుకొని ఆమ్ ఆద్మీ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ప్రజలకు, యువతను వారు కోరారు.

## వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు అన్ని విధాలా మేలు జరుగుతున్నదని వైఎస్ఆర్‌టీయూసీ నగర అధ్యక్షులు ఏ1 అంబులెన్స్ నాగరాజు పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందు తోందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశా రు. శనివారం ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాసాను వైఎస్ ఆర్‌టీయూసీ నగర అధ్యక్షుడు నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి పాటుపడతారని పేర్కొన్నారు.

## జగన్ పాలనలో విద్యకు పెద్దపీట

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:



రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయం, వైద్యంతో పాటుగా విద్యకు కూడా పెద్ద పీట వేసినట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సాయి దత్త అన్నారు. విద్యార్థులకు వసతి దీవెన, ఫీజు రీ యింబర్స్ మెంట్, అమ్మఒడి వంటి పథకాలు విద్యార్థుల చదువులకు ఎంతగానో ఉప యోగపడతున్నాయని తెలిపారు. శనివారం కడపలో ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా, వైకాపా విద్యార్థి నేత సాయిదత్త ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిదత్త ఆమట్లాడుతూ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను జగన్ సర్కార్ ఏర్పాటు చేసిందని కొనియాడారు. మంత్రిని కలిసిన వారిలో విద్యార్థి నాయకుడు శివ ఉన్నారు.

## ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి కృషి

### – ఎల్‌టీపీల రాష్ట్ర ఛైర్మన్ మురళీకృష్ణ

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడి టోరియంలో శనివారం జరిగిన జిల్లా ఎల్ టీపీల సమావేశంలో ఏపీడీపీఎంఎస్ డైరె క్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఇంజినీర్ల సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తామని ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ మురళీకృష్ణ అన్నారు. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ సమస్యలను విన్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసకుమార్ పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ వివిధ సమస్యల గురించి చర్చిం చారు. ఏఈ సమావేశానికి రాష్ట్ర ఛైర్మన్ మురళీకృష్ణ, అధ్యక్షులు శ్రీనివాస కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కమలాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కృష్ణ పసాద్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కుమార మంగళం, ట్రెజరర్ ఖాసీం, ఈసీ మెంబర్ జగన్ మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి గంజికుంట గణేష్ మాట్లాడుతూ జనరల్ బాడీ మీటింగ్ సమావేశానికి వచ్చే వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తామన్నారు. నగర అధ్యక్షులు కుమార్ మంగళం, నగర వైస్ ప్రెసిడెంట్ టిప్పు సుల్తాన్, నగర ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డి, నగర ట్రెజరర్ ఆజాం, ప్రొద్దుటూరుకు సంబంధించి సెక్రటరీ గంగరాజు, ట్రెజరర్ సంపత్ కుమార్, జైసీ రామాంజనేయులు, బద్వేలు నుంచి వేణుగోపాల్, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

## ఆ భూమికి, మాకు ఎలాంటి సంబంధం లేదు

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



ఆ భూమికి, మాకు ఎలాంటి సంబం ధం లేకపోయినా మాపై అక్రమ కేసులు పెట్టి మమ్మల్ని కోర్టుల చుట్టు లాగుతున్నా రని నాగులపల్లికి చెందిన నీలకంఠా రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడుతూ మా మీద జమ్మల మడుగుకు చెందిన శాంతారాం, శశికళలు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని వాపోతున్నారు. వారు చెబుతున్న భూమి చాపాడు గ్రామ పొలంలోని సర్వే నెం బర్ 105-ఎలో 2.82 ఎకరాల భూమికి సంబంధించి మాకు కానీ, మా కుటుంబ సభ్యులకు కానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. కొత్తపల్లె సర్పంచ్ బండి నాగేంద్ర, వనిపెంటకు చెందిన కలిమి పుల్లారెడ్డి, బాపతి సంజీవ్‌రెడ్డి, శ్రీను భూ తగాదాలతో గొడవ పడుతూ మధ్యలో మాకు సంబంధం లేని వ్యవహారాన్ని చెప్పడం చాలా బాధాకరమన్నారు. భూమి తగాదాలో ఇబ్బంది పెట్టవద్దని అధికారు లకు పోలీసులకు విన్నవించారు.

## ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



టీడీపీ పార్లమెంటరీ బోర్డు కార్య దర్శి, జమీల్ మొబైల్స్ అధినేత జమీల్ అహ్మద్ పేద ప్రజల కోసం నిర్వహిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీని వాసరెడ్డి అన్నారు. స్థానిక ఆయేషా నగర్ హజరత్ అయేషా హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభిం చింది. నగరంలోని 15 మంది ప్రముఖ వైద్యులు పాల్గొని వందలాది మంది రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి కావాల్సి న మందు లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న శ్రీనివాసరెడ్డి(వాసు) మాట్లాడుతూ జమీల్ అహ్మద్ పేద ప్రజలకు సేవలందిం చేందుకు మరిన్ని మెగా వైద్య శిబిరాలు నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీలకతీతంగా ప్రముఖులందరూ పాల్గొని జమీల్ అహ్మద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## అంబులెన్స్‌ను ప్రారంభించిన అంజాద్‌బాషా

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



స్థానిక బ్రాహ్మణవీధి రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపం ఆర్య క్షత్రియ సంఏమ సంఘం రాష్ట్ర స్థాయి ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా పాల్గొని సంఘ సేవ కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ప్రారం భించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కలిగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అజ్మ తుల్లాఖాన్, గౌస్‌బాషా, అలీ అక్బర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అధికార భాషా సభ్యునికి అభినందన సభ

మైదుకూరు ఫిబ్రవరి 26, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు అభి నందన సభ కడప రోడ్డు మైదుకూరు సాయి భగవాన్ కల్యాణమండపంలో జరి గింది. కార్యక్రమం వాట్సాప్ గ్రూప్ (ఫ్రెండ్స్), రాటా ఆధ్వర్యంలో బొమ్మిశెట్టి మోహన్, రమేష్ ,శీలం విశ్వనాథ్ (చిన్న) నిర్వహించారు. సభకు సీనియర్ జర్నలిస్ట్ పవన్ పంతులు అధ్యక్షత వహించారు. సభకు ముఖ్యఅతిథిగా నన్నపరెడ్డి పాల్గొన్నారు. నన్నపురెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా తెలుగు భాషకు గని అన్నారు. ప్రభుత్వానికి ,ప్రజలకు మధ్య అధి కార భాషా సంఘం సభ్యులు వారధి లాంటివారని అన్నారు. పులివెందుల రచయిత వంగల కొండారెడ్డి ప్రసంగిస్తూ తవ్వాకు అభినందన సభ బొమ్మిశెట్టి బ్రదర్స్ నిర్వహించడం గొప్ప విషయం అని చెప్పారు.మరో రచయిత షబ్బీర్ మాట్లాడుతూ కడప జిల్లాలో ఏ కథకైనా సమీక్ష చేయాలంటే ఏ ఒక్కరూ లేరని,అన్ని చూపులు, అన్ని వేలు ఒక వ్యక్తి పైనే ఉంటాయని ఆ వ్యక్తియే తవ్వా వెంకటయ్య అని తెలిపారు. మరో రచయిత షేక్ మహమ్మద్ భాష అధికార భాషా సంఘానికి సొగసు, వన్నె తవ్వా వెంకటయ్య తీసుకొని వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సభలో రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి, మేధా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగిపోవు విజయభాస్కర్, హెడ్మాస్టర్ ఏవి రమణయ్య, కత్తి గురువారెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సాహితీ మిత్రులు, రచయితలు, కవులు, ప్రజలు పాల్గొన్నారు.

## సర్వ దేవతలు కొలువైన దేహమే గోమాత : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 26, ప్రభాతవార్త



సర్వదేవతలు కొలువైన దేహమే గోమాత అని గోసంరక్షణ హిందువుల బాధ్యత అని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు ఆదివారం స్థాని క శ్రీకృష్ణ ఆలయంలో అధ్యక్షులు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో ఆయన గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గోమాతను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్లే అవుతుందని తెలిపారు. క్రిష్ ఆలయం వద్ద గోషాల ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు పురపాలక సంఘం పాలకమండలి ఆధ్వర్యంలో రోడ్లపై ఉన్న గోవులను సురక్షితంగా గోశాలలకు తరలించామని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితంలో యాదవ సోదరులే ప్రముఖ పాత్ర వహిం చారని రాజ్యాధికారం అందిం చడంలో వారికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు మండలా ధ్యక్షుడు యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేకు అధ్యక్షులు చల్లా రాజగోపాల్ కు ఉన్న సత్సంబంధాల కారణంగా గోశాల నిర్మాణం పూర్తయిందన్నారు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ గోశాలకు గోమాతలను దానంగా ఇవ్వడం తన అదృష్టం అన్నారు శ్రీకృష్ణ ఆలయ కమిటీ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ మాట్లా డుతూ గోశాలను ప్రారంభించిన అనంతరం ఎన్నో సమస్యలు ఎదురయ్యాయని వాటన్నిటిని పరిష్క రిస్తూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గోశాల నిర్మాణానికి సహకరించారని ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గోశాలను ప్రారంభించేందుకు అప్పటి టీటీడీ పాలకమండలి సభ్యులు చిప్పగిరి ప్రసాద్ టిటిడి తరపున రెండు గోవులను అందించారన్నారు ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, శ్రీకృష్ణ ఆలయ యాదవ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు సోమలవారిపల్లె మాజీ సర్పంచ్ రమణయ్య టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు చిప్పగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

## జమా అతే ఇస్లామి హింద్ సంస్థను విస్తృత పరుస్తాం

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో జమా అతె ఇస్లామిహింద్ సంస్థ స్థాపించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆదివారం స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్లో ఒక గొప్ప ఆధ్యాత్మిక బహిరంగ సభ నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరు అయిన జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ రఫిఖ్ మాట్లాడుతూ జమాఅత్ ఇస్లామిహింద్ సంస్థ ఏర్పడి 75 సంవత్సరాలు కావ స్తున్నా సంధర్భంగా జమాఅత్ వ్యవస్థను విస్తృత పరచడంతో పాటు జమాఅత్ వివిధ కాలల్లో ఏమేమి పనులు నిర్వహిస్తు వస్తుందో ప్రజలకు తెలియ పరచడం కొరకు ఇటువంటి సభలు సమావేశాలు చేస్తు వస్తున్నామని తెలిపారు. దైవ ధర్మాన్ని సాటి మానవులందరికి చేరవేసే బాధ్యత ముస్లిం సమాజం పై ఉందని, జమాఅత్ మంచి పని చేస్తుందని మీరు తలిస్తే మీరు కూడ మాతో పాటు కలిసి ముందుకు నడవలని కోరారు. కార్యక్రమంలో జమాఅతె ఇస్లామిహింద్ కేంద్ర సలహామండలి సభ్యులు మౌలాన ఎజాజ్ అస్లం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరీముద్దీన్, మౌలాన గౌస్ మొహిద్దీన్, యన్.యస్. మొహిద్దీన్, హుస్సేన్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు షరీఫ్, మౌలాన సయ్యద్ ఇనాయ తుల్లా (చీఫ్ ఖాజి ప్రొద్దుటూరు), మౌలాన అబు సాలెహ రషాది (ప్రొద్దుటూరు), మౌలాన మహబూబ్ బాష ఇలాహి (ప్రొద్దు టూరు), జనాబ్ షా మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ (ప్రొద్దు టూరు), జనాబ్ సయ్యద్ హబీబుల్లహ్ (గవర్నమెంట్ ఖాజి ప్రొద్దుటూరు) పాల్గొ న్నారు. తదనం తరం మౌలాన ఎజాజ్ అహ్మద్ (జమాఅత్ కేంద్ర సలహా మండలి సభ్యులు) ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించారు.

## అలరించిన నవదుర్గాల సందర్శనం

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త




మోడంపల్లి ఓం శాంతి కేంద్రం నందు నిర్వహిస్తున్న ద్వాదశ జ్యోతిర్లింగ సందర్శనం లో భాగంగా 2వ రోజు ఆదివారం ద్వాదశ జ్యోతిర్లింగ సందర్శనం, నవదుర్గాల సందర్శనం విశేషంగా నిర్వ హిం చారు. అనంతరం నాట్య విశారద మోహిదీన్ ఖాన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 30 అడుగుల శివలింగం ప్రత్యేక ఆకర్షణగా నిలి చింది. ప్రజలు దర్శించుకున్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

## ప్లీనరీతో కాంగ్రెస్‌కు పునర్వైభవం తథ్యం

**వేంపల్లె, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**



చత్తీస్‌గడ్ రాజధాని రాయపూర్‌లో జరిగిన ఏఐసీసీ 85వ ప్లీనరీ సమావేశం దేశ చరిత్రలో కాంగ్రెస్ చరిత్రలో ఒక మైలురాయి అని కాంగ్రెస్ మీడియా ఛైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి అభివర్ణించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాయపూర్ ప్లీనరీతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తిరిగి వస్తుందన్న నమ్మకం కలిగిందని తెలిపారు. ఈ ప్లీనరీలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఏపీకి సంబంధించి ప్రత్యేకహోదా అమలుకు, విభజన చట్టంలో పేర్కొన్న అంశాల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, చెన్నకేశవులు, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉత్తన్న, బద్రి, రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన ఉచిత హోమియో వైద్య శిబిరం

**వేంపల్లె, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**



వేంపల్లె ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో కడపకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ క్రిష్టిపాటి వెంకట శేషఫణి చే 102మందికి ఉచితంగా హోమియో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు అవోపా హోమియో క్యాంప్ ఛైర్మన్ పోలేపల్లె సాయి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే అవోపా లక్ష్యమని తెలిపారు. ఈ శిబిరానికి దాతలు పోలేపల్లె రమేష్‌బాబు, నారాయణ, సుబ్బారావులు సహకరించాలని తెలిపారు. అవోపా ఆధ్వర్యంలో దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె అవోపా అధ్యక్షుడు గోవర్ధన్, సభ్యులు సాయికిరణ్, సాయి కౌశిక్, కిరణ్‌కుమార్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ మీట్‌కు వేంపల్లె విద్యార్థి ప్రశాంత్ ఎంపిక

**వేంపల్లె, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :**



వేంపల్లెలోని శ్రీవాణి పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న ప్రశాంత్ అనే విద్యార్థి అండర్14 క్రికెట్ విభాగంలో నేషనల్ మీట్‌కు ఎంపికయ్యాడు. మచిలీపట్నంలో ఎస్జీఎఫ్ నిర్వహించిన స్టేట్ మీట్‌లో కడప జిల్లా నుండి ప్రాతినిథ్యం వహించిన ప్రశాంత్ బ్యాటింగ్‌లో మంచి ప్రతిభ కనపరిచి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే నేషనల్ మీట్‌కు ఆంధ్ర అండర్14 జట్టుకు ప్రాతినిథ్యం వహించబోతున్నాడు. తాను నేషనల్ మీట్‌కు ఎంపిక కావడానికి పాఠశాల యాజమాన్య, కోచ్ అహమ్మద్ బాషా కృషి మరువలేనిదని ప్రశాంత్ అన్నాడు. భవిష్యత్తులో ఇండియా టీంకు ఆడాలన్నదే తన కోరిక అన్నారు. ప్రశాంత్‌ను శ్రీవాణి ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు భూమిరెడ్డి రామగంగిరెడ్డి, కరస్పాండెంట్ హనుమంతరెడ్డిలు అభినందించారు.

## నేడు విద్యుత్తుకు అంతరాయం

**దువ్వూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మదిరేపల్లె విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ వీరారెడ్డి తెలిపారు. మదిరేపల్లె సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఉదయం 8 గంటల వరకు విద్యుత్తు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించుకోవాలని వినియోగదారులను కోరారు.

## అంకితభావంతో సహకారం అందిస్తా

**జగన్‌రాజు**


**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**



రాష్ట్రీయ క్షత్రియ సేవాసంఘం నిర్వహించే ఏ సేవా కార్యక్రమాలను చేపట్టినా అంకితభావంతో తనవంతు సహకారం అందించేందుకు సిద్ధమని తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత, రాజు విద్యా సంస్థల అధినేత చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. ఆదివారం బోయనపల్లెలోని శాన్వి హైస్కూల్లో రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం, ఫెడరేషన్ ఆఫ్ క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరంలో పాల్గొన్న జగన్‌రాజు మాట్లాడుతూ రాయలసీమలోనే కనివిని ఎరుగని రీతిలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరం ఎందరో పేదలకు వైద్యం అందేలా చేసిందన్నారు. ఇంతపెద్ద స్థాయిలో ఎప్పుడు వైద్యశిబిరం నిర్వహించలేదన్నారు. అందుకు కృషి చేసిన క్షత్రియసేవా సంఘం నేతలు డాక్టర్ బలరామాజు, డాక్టర్ సుదర్శన్‌రాజుల కృషి ఎంతో ఉందన్నారు. సంఘం సమిష్టి కృషితోనే మెగా మెడికల్ క్యాంపు సక్సెస్ అయ్యిందన్నారు. విద్యారంగంలో కూడా ఇదేవిధంగా క్షత్రియ సేవాసంఘం ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. అందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను బోధించేలా తన సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సంఘం నేతలు, శాన్వి హైస్కూల్ కరస్పాండెంట్ కె.శరత్‌కుమార్‌రాజు, తదితరులతో పాటు డాక్టర్ ఎస్.చక్రధర్, డాక్టర్ ఎస్.బాలరాజు, డాక్టర్ ఎస్.మహేష్, డాక్టర్ కె.భాస్కర్‌రాజు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ జయప్రకాష్ తదితరులతో పాటు డాక్టర్ శ్రీహరినాయుడు, డాక్టర్ రవిరాజు, డాక్టర్ వంశీ తదితరులు ఉచిత వైద్యశిబిరంలో ప్రజలకు సేవలందించారు.

## సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారు

**పీలేరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్తః**



2023- 24 విద్యాసంవత్సరం సైనిక్ పాఠశాలలో ప్రవేశానికి ఆల్ ఇండియా సైనిక్ ఎంట్రన్సు ఎగ్జామినేషన్స్ నిర్వహించిన సైనిక్ ప్రవేశ పరీక్షలో ఎక్సలెన్సు అకాడమీ నుంచి ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారని డైరెక్టర్ జ్యోష్న అన్నారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారన్నారు. వారిని యాజమాన్యం అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈవిజయానికి కషిచేసిన ఉపాధ్యాయ బందాన్ని ప్రశ్నించారు.

## గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన ప్రసాద్‌బాబు

**రాయచోటి.ఫిబ్రవరి26 ప్రభాతవార్త**



రాయచోటి పట్టణం మదనపల్లి రోడ్డు సమీపంలోని రాయుడు కాలనీ వద్ద ఉన్న గంగమ్మ తల్లికి ఆదివారం టిటిడి పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ భక్తి భావాలు ఉన్నప్పుడు ఐకమత్యం ఉంటుందని ఈర్షద్వేషాలు ఉండవని అన్నారు. ఆలయ కమిటి సభ్యులు ప్రసాద్‌బాబును శాలువా కప్పి పూలమాలవేసి సత్కరించారు. ప్రసాద్‌బాబు వెంట తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన పోలేరమ్మ జాతర

**గాలివీడు.ఫిబ్రవరి26 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని పూసలపేట, శెట్టివారిపల్లిలో వెలసిన శ్రీ పోలేరమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. శనివారం ఉదయం సిద్దల కూడు నైవేద్యం తో ప్రారంభమయిన జాతర రాత్రి నిండు తిరుణాలలో చెక్క భజనలు, కోలాటాలతో అంగరంగ వైభవంగా జరిగింది. మొక్కుబడులు కలిగిన భక్తులు అమ్మవారికి చాందినీ బండ్లను కట్టి అమ్మవారి చుట్టు ప్రదక్షిణలు చేయించి మొక్కుబడులు తీర్చుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివారం తెల్లవారిజామున గ్రామంలోని మహిళలు భక్తి శ్రద్దలతో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం సాయంత్రం కల్లిపాటు కార్యక్రమంతో జాతర ముగిసింది.

## అపురూపం ఆ బాల్యదశ

**మళ్లీ మళ్లీ రావాలి ఈ అపురూప కలయిక**

**అబ్బురపరిచిన నృత్యాలు, భోజనాలు**

**రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు పట్టణంలోని 1984వ విద్యార్థిదశ అనుభవాలు మరుపురానివని గెట్ టు గెదర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపురూపమైనదని బ్యాచ్ నిర్వాహకులు అన్నారు. ఆదివారం రైల్వేకోడూరు పట్టణంలోని గాంధీ బొమ్మ వద్ద 1984వ బ్యాచ్ రెండో దఫా గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థి నాయకులు ఎస్.మస్తాన్, కాలువ రవీంద్ర, మహిళల్లో రామిరెడ్డి పద్మావతి, తోట సాయి, కలపాటి శ్రీధర్, సుబ్రమణ్యం, రామక్రిష్ణ, జొన్నలగడ్డ సత్యనారాయణ, ఉంగరాల చిన్నా, మంగంపేట హరినాథ్‌రెడ్డి, వి.సురేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ముఖ్యులు మాట్లాడుతూ దాదాపు 8 సంవత్సరాల క్రితం ఈ కార్యక్రమాన్ని స్థానిక హెచ్ఎంఎం హైస్కూల్ నందు వైభవంగా నిర్వహించామని, అయితే ఈ దఫా స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాలు నందు నిర్వహించి ఆనాటి విద్యార్థి అనుభవాలను తీపిగుర్తులు చేసుకొన్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమం మొదట గాంధీ విగ్రహం నుండి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి 1984వ బ్యాచ్ అనుభవాలను పట్టణ ప్రజలకు చూపించారు. ఈ కార్యక్రమంలో సుధ, లారీల అధినేత మధు, ఆర్‌కె ట్రావెల్స్ అధినేత రామ్‌కుమార్, మహిళలు చంద్రకళ, ఫర్విన్, శ్రీవాణి, కళావతితో పాటు పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు రంగాల శివకుమార్, అంబటి కిరణ్‌కుమార్, చెరువు వెంకటరమణ, కుర్రామణి, ఎర్ర మణి, మునిరాజు, బెనర్జి, భాస్కర్‌రాజు, రజనీకాంత్, తోటి మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ మండల కార్యవర్గం ఏర్పాటు

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**



యుటిఎఫ్ రాజంపేట మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో నూతన మండల కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షునిగా ఎం.రమణయ్య, ఉపాధ్యక్షునిగా పి.రవిచంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి.నాగేంద్ర, కోశాధికారిగా కె.శివయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.సుమలతలు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా కౌన్సిలర్‌లుగా ఎం.నాగేశ్వర్‌గౌడ్, పి.వెంకటసుబ్బయ్య, డి.చెంగల్‌రాజు, కె.శివకుమార్, ఆర్.సుబ్రమణ్యం, ఎం.సతీష్, కెవిఎస్ కిషోర్, పిఎల్‌వి ప్రసాద్, పి.కవిత, కె.జియాలతలు ఎన్నికయ్యారు.

## 600 కిలోల ప్రభుత్వ రేషన్ బియ్యం పట్టివేత

**కడప క్రైం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**

కడప నగరంలోని టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో అగాడివీధి నుంచి బెల్లమండి వీధికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని ఆదివారం ఎస్సై జయరాముడు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. దండుకు చెందిన వెంకట సుబ్బమ్మ తన దోసల దుకాణం కోసం ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తుండగా ఆటోను 15 బస్తాలు (ఒక్కో బస్తాలో 40 కిలోలు) మొత్తం 600 కిలోలను పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## ప్రమాదవశాత్తు బోద కొట్టం దగ్ధం

**సుమారు రూ.2 లక్షలు ఆస్థి నష్టం**

**కాశినాయన, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :**



మండలంలోని అమగంపల్లి దళితవాడలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో బోద కొట్టం పూర్తిగా దగ్ధమైంది. అగ్ని ప్రమాదంలో బాధిత కుటుంబానికి సుమారు 2 లక్షల రూపాయలు మేరా ఆస్థి నష్టం వాటిల్లిందని అమగంపల్లి దళితవాడకు చెందిన బత్తుల మార్థమ్మ అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైందని వాపోయారు. ఆదివారం మార్థమ్మ పొలం పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్ళగా పిల్లలు బయటికి వెళ్ళారు. హఠాత్తుగా బోద కొట్టము నుండి మంటలు చెలరేగడంతో స్థానికులు పోరుమామిళ్ళ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది వచ్చే లోపే బోద కొట్టం పూర్తిగా దగ్ధమైంది. దగ్ధమై కాలిపోయిన బోద కొట్టంలో పిల్లలు చదువుకున్న సర్టిఫికెట్లు, ఇంటి సామాగ్రి, బియ్యం, భూమికి సంబంధించిన పాసు బుక్కులు, వంట సామాగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయి కట్టుబట్టలతో మిగిలారు. వీరికి ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు.

## కంకరతోలి వదిలేసిన కాంట్రాక్టర్లు

**-ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**

**వీరబల్లి.ఫిబ్రవరి26 ప్రభాతవార్త**



రాయచోటి నుంచి వీరబల్లి మార్గము ఇటీవల కాంట్రాక్టర్లు తారురోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. మరమ్మత్తులు చేపట్టుటకు జేసిబితో రోడ్డును పగలతీసి అందులో కంకరతోలి వదిలేశారు. దీంతో ప్రయాణికులు వాహనాల డ్రైవర్‌లు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక సంబంధించిన అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు చర్యలు తీసుకుని పనులు త్వరితగతిన జరిగేటట్లు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రైవేటు భవన నిర్మాణానికి ప్రభుత్వాసుపత్రి నీళ్ళు

**ప్రహరీగోడ కూల్చేసినా పట్టించుకోని అధికారులు**

**మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:**



మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రి నీళ్లను ఓ వ్యక్తి గోప్యంగా ప్రైవేటు భవన నిర్మాణానికి వినియోగించడం ఆసుపత్రిలో ఆదివారం జరిగింది. స్థానిక ఆసుపత్రిలోని నీటి నిల్వ ఉంటే ట్యాంకు నుంచి పక్కనే నిర్మాణం చేస్తున్న వారు ఆసుపత్రి నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మోటారు పైపు నుంచి నీటిని పుట్టకొన్నారు. ఆసుపత్రిలోని వార్డుల్లోని రోగులకు సక్రమంగా నీరు లేకపోవడంతో ఇలా ఆసుపత్రిలోని నీటిని గోప్యంగా తీసుకుపోవడం ఆసుపత్రి అధికారులపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఆసుపత్రి అధికారులు అండదండలు లేకుండా ఇలా పబ్లిక్‌గా ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటిని పట్టుకొంటున్నారని స్థానికు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు భవన నిర్మాణం చేస్తున్న వ్యక్తి ఆసుపత్రి ప్రహరీని కూల్చేసినప్పటికి అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. నీరు వదిలే వ్యక్తికి తెలియకుండా ఈ నీటిని వినియోగించుకుంటున్నారా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్ఎం డాక్టర్ దివాకర్‌ను వివరణ కోరగా నీటి ట్యాంకు నుంచి తమకు తెలియకుండా నీటిని వాడుకోవడాన్ని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది మోటార్లు తొలగించామన్నారను. అయితే నీరు ఎవరి అనుమతి తీసుకొని వాడుకున్నారో సోమవారం విచారణ చేస్తామన్నారు. అందుకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## దుఃఖాన్ని చెబుతూ భవిష్యత్తును ఊహిస్తున్న కవిత్వం ఆస్మాని

**పుస్తకాల ఆవిష్కరణలో విరసం మాజీ కార్యదర్శి పాణి**

**ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**



మానవ జీవితంలోని దుఃఖాన్ని చెబు తూ భవిష్యత్తును అత్యున్నతంగా ఊహి స్తున్న కవిత్వం మహమూద్ రాసిన ఆస్మా ని కవిత్వమని విప్లవ రచయితల సంఘం మాజీ కార్యదర్శి పాణి కొని యాడారు. ఆదివారం మిత్రజ్యోతి సాహితీ సాంస్కృతిక సంస్థ, విరసం, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా మూడు సాహిత్య పుస్తకాల ఆవిష్కరణ సభను ప్రొద్దుటూరు లోని రోటరీక్లబ్ నందు నిర్వహించారు. ఈ సభలో మహమూద్ రాసిన ఆస్మాని కవి త్వం పై పాణి మాట్లాడుతూ జీవితం చుట్టూ వున్న కన్నీటి పోరాటాలను, విప్లవంలో పోరాడుతున్న ప్రజలను గురించి అందులో నేలకొరిగిన వీరుల గురించి రాసిన విప్లవ కవులలో మహమూద్ ముందు వరుసలో ఉంటారని అన్నారు. కె ఆర్ బిట్టూ రాసిన లైంగిక వైవిధ్యాలు అనే వ్యాస సంకలనం పైన కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత సామాజిక కార్యకర్త సజయ మాట్లాడుతూ వర్తమాన సమాజంలో హింసా త్మకమైన లైంగిక పరిభాష పెరుగుతోందని అన్నారు. మరో సామాజిక కార్యకర్త సమీర మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ జీవితాలను మేమే ఈ ప్రపంచానికి బహిర్గ తం చేయాల్సి వస్తుందని అన్నారు. పావని రాసిన సిక్స్ పాక్ రాముడు కథా సంకలనాన్ని ప్రముఖ కథా రచయిత వేంపల్లి షరీఫ్ సమీక్షిస్తూ ఈ సంకలనం లోని కథల టైటిల్సే ఎంతో వైవిధ్యంగా ఉన్నాయన్నారు. ఆవూ ఆత్మహత్య కథ ఈ సమాజంలో మనిషికి లేని విలువను గోవుకు ఉండడం పై చర్చించిన కథ అని అన్నారు. విరసం ప్రచురించిన ఈ మూడు పుస్తకాలు మూడు వైవిధ్యమైన పుస్త కాలు పాఠకులకు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ సమావేశానికి తెలుగు అధ్యాపకులు డా. దస్తగిరి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డా. వినోదిని, జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, విరసం కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి, పట్టణంలోని ప్రముఖ కవులు ఎ.సి. దస్తగిరి, రామాయణం రాజేశ్వరి, కాశీవరపు వెంకటసుబ్బయ్య, సి.వి. సురేష్, టలేసుముచ్చట్ల వేణుగోపాల్, పల్లవోలు రమణ, సృజన శ్రీను, పద్మ, హేమలత, సునీత, రాజేష్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**- హోమియో ఆయుర్వేద వైద్యులు మాలేపాటి వెంకటరామ్**

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :**



బద్వేలు పట్టణంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం, ఆవోపా కమిటీ ఆవోపా మహిళా విభాగ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కడప జిల్లా ఆవోపా ప్రెసిడెంట్ మరియు హోమియో మరియు ఆయుర్వేద వైద్యులు డా॥ మాలేపాటి వెంకటరామ్ సహకారంతో ఉచిత హోమియో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి పైగా వివిధ రకాల వ్యాధులకు సంబంధించి మెగా వైద్య శిబిరం నిర్వహించి, వ్యాధుల పట్ల తగిన సలహాలు, సూచనలు ఇస్తూ వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. అనంతరం 6 మంది పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహ బహుమతులను వారి చేతుల మీదుగా అందజేశారు. తదనంతరం ఆవోపా జిల్లా ప్రెసిడెంట్ డా॥ మాలేపాటి వెంకటరామ్ మాట్లాడుతూ వయసు పైబడిన ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆవోపా అధ్యక్షులు నూకల రెడ్డెయ్య, ఆవోపా స్టేట్ మెంబర్లు ఉరిమి సుబ్బారావు, చప్పరపు సుబ్బారావు, సెక్రటరి జొన్నలగడ్డ శ్రీధర్, ట్రెజరర్ పత్తి రాఘవేంద్ర, ఆవోపా కమిటీ మహిళా విభాగ్ అధ్యక్షురాలు సముద్రాల మాధవీ లత, సెక్రటరి పెసల శ్రీవాణి, ట్రెజరర్ దరిశా సౌజన్యలు మాట్లాడుతూ ఆవోపా కమిటీ జిల్లా అధ్యక్షులు డా॥ మాలేపాటి వెంకటరామ్ బద్వేలు ప్రాంతంలో ఆర్యవైశ్యులను గుర్తుంచుకొని అవసరమైన మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి జిల్లా అధ్యక్షులు అయినప్పటి నుండి ఇప్పటికి మూడు దఫాలు మెడికల్ కా ్యంప్‌లు ఏర్పాటు చేసి వారికి అవసరమైన మందులను అందచేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆవోపా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బచ్చు సురేష్ బాబు, పబ్బతి సత్యనారాయణ, గొల్లమందల వేణు, యల్లనూరు రమణ, చాటకొండు సుబ్బారావు, సముద్రాల శ్రీనివాసులు, కుంజేటి వెంకటసుబ్బారావు, మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, పబ్బతి శ్రీదేవి, పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా రామలింగేశ్వరస్వామి ఉత్సవం

**రామసముద్రం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:**

మండలంలోని కర్నాటక బార్డర్‌లో వెలసిన రామలింగేవ్వరస్వామి ఉత్సవా లు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు, స్థానికలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించీరు.రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భక్తులు మొక్కలు తీర్చుకొన్నారు.

## భూ ఆక్రమణలో పెద్దఓరంపాడు చెరువు

**- రెడ్డివారికుంట-కాబోతుంది మరొకరికి పంట**

**ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలంలోని పెద్దఓరంపాడు చెరువు మండలంలోకే విస్తీర్ణంలో అతి పెద్దదని చెప్పవచ్చు. అయితే కాలక్రమేనా ఈ చెరువు భూ ఆక్రమణల కబంధహస్తాల్లోకి చేరుకుంటోంది. వర్షాలు తగ్గుముఖం పట్టడం, కురిసిన వర్షం నీరు చెరువులోకి రాకుండా ఆక్రమణదారులు కాలువలను చెరువులను, స్థలాలను ఆక్రమించి గట్లు వేసి పంటలు పండించడంతో కొంత మేర ఆ చెరువులోకి నీరు రాకపోవడం జరుగుతోందని ప్రజలు, దళితులు అంటున్నారు. ఈ నేపథ్యంలో పంట చెరువు ఆక్రమించగా ప్రస్తుతం రెడ్డివారికుంట మరొకరికి పంటగా మారుతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా రోజు రోజుకు భూ గర్భ జలాలు అడుగంటకుండా చెరువులలో నీటిని నిల్వ చేయాలని ఏపీ సీఎం జగన్ చెరువుల పూడికతీత అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా వాటిని కొందరు నాయకులు, అధికారులు పక్కదారి పట్టించి పూర్తిగా చెరువులను, కకుంటలను విస్మరించి వాటి అభివృద్ధికి తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి ఆక్రమణలకు గురవుతున్న చెరువులు, కుంటలు ఆక్రమిస్తున్న వారిపై కొరఢా ఝుళించి కాపాడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

## మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**పీలేరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్తః**




ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ ్బంది మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్స్‌పెక్టర్ గుంటూరు రామకష్ణశాస్త్రి హెచ్చరించారు. ఈసందర్భంగా చిత్తూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్ , డిపో ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు ఆదివారం ఆయన పీలేరులో గల మద్యం దుకాణాలను తనిఖీచేశారు. మందు బాటిళ్ల స్టిక్కర్లను స్కాన్‌చేసి ఇవ్వాలని సూచించారు. ఈసందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరపాలన్నారు. ప్రతిరోజు అమ్మకాలు జరిపిపైకాన్ని తప్పనిసరిగా మరుసటిరోజు బ్యాంకులో సకాలంలో చలానా రూపంలో చెల్లించాలన్నారు. సిబ్బంది ఏవైనా పొరబాట్లు చేస్తే కేసులు నమోదుచేస్తామన్నారు తనిఖీల సమయంలో సిబ్బంది విధులకు హాజరుకాకుంటే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. షాపుల్లో ఉన్న నిల్వలను రికార్డులను తనికీచేశారు. తనఖిలో డిపో హెడ్ కానిస్టేబుల్ రమణ,,రాజశేఖర్‌రెడ్డి తో పాటు, సైపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

## సన్నజాజి...గుండుమల్లెలు భలే సువాసన

**పూలతోటల్లో రైతులు బిజి**

**రామసముద్రం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :**



సన్న జాజి మల్లెలు పూసే సీజన్ వచ్చేసింది. రైతులు తోట పనులలో బిజి అయ్యారు. ఇప్పటికే పూలు ప్రారంభమయ్యాయి. పూల సీజన్ మొదలు అయిందంటే కూలీలకు దాదాపు ఎనిమిది నెలలు ఉపాది లభించినట్లే. రామసముద్రం పరిసరాలలో సన్నమల్లెలసాగును, గుండెమల్లెలు, బంతిపూలు విస్తారంగా పండిస్తారు. సన్నమల్లెల సీజన్ ఫిబ్రవరి నెల ఆఖరు నుంచి అక్టోబరు, నవంబరు నెలలు వరకు పూల సీజన్ సాగుతుంది. దీంతో కూలీలకు ఎనిమిది నెలల పాటు ఉపాది లభిస్తుంది. రామసముద్రం మండలంలోని పరిసర ప్రాంతాలలోనే కాక తిరుమలరెడ్డిపల్లె, చెంబకూరు, మదనపల్లెనుంచి రామసముద్రం రోడ్డు వంటి ప్రాంతాల్లో కూడా పూల సాగును విస్తారంగా పండిస్తారు. జిల్లాలోనే పూలసాగులో కుప్పంకు ప్రాదాన్యత సంతరించుకొంది. తరువాత స్థానం రామసముద్రం, చెంబకూరు మండలంలో పూల తోటలపై రైతులు ఎక్కువ మక్కువ చూపుతారు. సన్నమల్లెల తోటలతో పాటు కనకాంబరం, బంతి పూలు, చామంతి, కాగడాలు, రోజాలు, లిల్లీతోటలను పండిస్తారు.వీటిని మదనపల్లి, బెంగుళూరు, కడప, ప్రొద్దుటూరు, మద్రాసు, నెల్లూరు, కావలి, విజయవాడ, హైదరాబాదు, రాజమండ్రి తదితర పెద్దపెద్ద పట్టణాలకు ఎగుమతి చేస్తారు.

